సాక్షి వరంగల్

మంగళవారం । 29 । జూలై । 2025



టీ-హబ్‌తో ఎంఓయూ కోసం చర్చలు

హైదరాబాద్‌లోని టీ-హబ్ కార్యాలయాన్ని వీసీ ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు సోమవారం సందర్శించారు. - 8లో▸



తప్పిన పెనుప్రమాదం

ఎంజీఎంలో ఆదివారం రాత్రి నర్సింగ్ స్కూల్ భవనం పైపెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. సాయంత్రం నుంచి అక్కడక్కడా మోస్తరు వర్షం కురుస్తుంది.

శరణ్ చాలా స్మార్ట్

- తెల్లపులి పుట్టి పెరిగింది హైదరాబాద్ జూ లోనే..
- డేట్ ఆఫ్ బర్త్ : 2012, అక్టోబర్ 20
- బోన్‌లెస్ మటన్ అంటే ఇష్టం.. శనివారం రోజంతా ఫాస్టింగ్
- కాకతీయ జూ పార్కులో ప్రత్యేక ఆకర్షణ
- ఆసక్తికర విషయాలు వెల్లడించిన జూ పార్క్ అధికారులు



భారీ ఆహార్యం.. నడకలో రాజసం.. గాండ్రింపులో గాంభీర్యం.. దాన్ని చూస్తే ఏ జంతువైనా పారిపోవాల్సిందే. అలాంటి తెల్ల పులి(శరణ్)ని సందర్శకుల కోసం ఇటీవల వరంగల్ కాకతీయ జూలాజికల్ పార్క్‌కు తీసుకొచ్చారు. క్రూర మృగాల్ని చూడాలన్నా.. చాలా మందికి భయమే కానీ.. ఆ భయం వెనుక వాటి గురించి తెలుసుకోవాలనే ఉత్సాహం కూడా దాగి ఉంటుంది. అందులో భాగంగానే శరణ్ (వైట్ టైగర్) గురించి 'సాక్షి' కొన్ని ఆసక్తికర అంశాలు సేకరించింది. నేడు (మంగళవారం) అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మన తెల్ల పులిపై ప్రత్యేక కథనం. - న్యూశాయంపేట

చూడడానికి డిఫరెంట్‌గా ఉండే వైట్ టైగర్ (శరణ్, 13 సంవత్సరాలు మగ) పుట్టి పెరిగింది భాగ్యనగరంలోనే. హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో 2012, అక్టోబర్ 20న జన్మించింది. శరణ్ తండ్రి పేరు బద్రి, తల్లిపేరు సురేఖ అని అటవీ రేంజ్ అధికారి మయూరి తెలిపారు. శరణ్ బరువు (180 కేజీలు) వరకు ఉంటుంది. దీని జీవితకాలం 15 ఏళ్లు. త్వరలో ఆడ తెల్లపులిని కూడా జూకి తీసుకొస్తామని వారు పేర్కొన్నారు.

జూలో సందడే.. సందడి


వరంగల్ నగరంలోని కాకతీయ జూలాజికల్ పార్క్‌లో సందర్శకులకు తెల్ల పులి కనువిందు చేస్తోంది. ఈ నెల 18వ తేదీన తెల్లపులిని బోనులో నుంచి ఎన్‌క్లోజర్‌లోకి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. నగర వాసులు, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులు ఈ తెల్లపులిని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బోన్‌లెస్ అంటే ఇష్టం..

తెల్లపులి (శరణ్) బోన్‌లెస్ మాంసాన్ని ఇష్టంగా తింటుంది. అందులో భాగంగా వాటికి ప్రత్యేకంగా బీఫ్ మాంసాన్ని రోజుకు 6 కేజీల చొప్పున పెడుతున్నామని జూ పార్క్ వెటర్నరీ డాక్టర్ కార్తికేయ తెలిపారు. జంతు ప్రదర్శన శాలలో తెల్ల పులులకు బీఫ్‌ను మాత్రమే అందిస్తారని ఆయన పేర్కొన్నారు. వీటిలో లివర్, హార్ట్, స్ప్లీన్ ఇష్టంగా తింటుందని తెలిపారు. ప్రతీ శనివారం తెల్లపులిని ఉపవాసం ఉంచుతామని, ఆరోగ్య రీత్యా ఇది అవసరమని డాక్టర్ చెబుతున్నారు. ఆరోజంతా లవణాలతో కూడిన నీటిని అందిస్తామంటున్నారు.

లీటర్ మిల్క్.. కేజీ చికెన్





ప్రతీరోజు ఉదయాన్నే రెండు ఎగ్స్, లీటర్ మిల్క్, కిలో చికెన్‌ను శరణ్‌కు అందిస్తారు. ఆర్ఓ ప్లాంట్ వాటర్‌నే తాగిస్తారు. పులి ఆరోగ్యంగా ఉండేందుకు ఎల్‌క్ట్రాల్ పౌడర్, కాల్షియం సప్లిమెంట్స్‌తో కూడిన ద్రావణాన్ని అందిస్తారు. అనంతరం ఎన్‌క్లోజర్‌లోకి వదులుతారు. సాయంత్రం జూ క్లోజ్ అయ్యే వరకు ఎన్‌క్లోజర్‌లో సందర్శకులు వీక్షించేందుకు ఉంచుతారు.

శరణ్ అని పిలిస్తే చాలు..



ఉదయం నుంచి రాత్రి వరకు బాగోగులు చూసే టైగర్ కేర్ టేకర్ మూర్తి.. శరణ్ అని పిలిస్తే చాలు.. పరిగెత్తుకుంటూ వస్తుంది వైట్ టైగర్. అతను పెట్టిన ఆహారాన్ని తింటుంది. పులికి కావాల్సిన ఆహారాన్ని అందిస్తూ దాని ఆలనాపాలన చూస్తూ మూర్తి అన్నీ గమనిస్తుంటాడు.

నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం



న్యూస్‌రీల్

కేఎంటీపీ వరద కాల్వ పనుల పరిశీలన



గీసుకొండ: గీసుకొండ-సంగెం మండలాల పరిధి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంక్ సోమవారం సాయంత్రం సందర్శించారు. కేఎంటీపీలో నిర్మిస్తున్న వరద కాల్వ పనులు పరిశీలించారు. వరద కాల్వ నిర్మాణానికి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి రూ.160 కోట్ల నిధులు మంజూరు చేయగా.. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. కాల్వ పనుల్ని త్వరగా పూర్తి చేయాలని శశాంక్ అధికారులను ఆదేశించారు. కేఎంటీపీలో ఎన్ని పరిశ్రమలు ఏర్పడ్డాయి? వాటి పురోగతి ఎలా ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామినాయక్, వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఏఈ సునీత, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, ఆర్ఐ శ్రీధర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నార్కొటిక్స్ డీఎస్పీగా రమేశ్‌కుమార్



రామన్నపేట: వరంగల్ నార్కొటిక్స్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పి.రమేశ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఇక్కడ పనిచేసిన కె.సైదులు హైదరాబాద్‌లోని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రమేశ్‌కుమార్‌కు ఇన్‌స్పెక్టర్ రవీందర్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నిట్‌లో వర్క్‌షాప్ షురూ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం 'జియాన్ (గ్లోబల్ ఇన్షియేటివ్ ఆఫ్ అకడమిక్ నెట్‌వర్క్స్) ప్రోగ్రాం అడ్వాన్స్ ఇన్ అనాలసిస్ అండ్ మోడలింగ్ ఆఫ్ హైడ్రాలిక్స్ ఎక్స్‌ట్రీమ్స్' అంశంపై పది రోజుల వర్క్‌షాప్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా యూఎస్ఏలోని వర్జీనియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణ శ్రీధర్ పాల్గొని మాట్లాడారు.

హలారుద్రేశ్వరుడిగా..



హన్మకొండ కల్చరల్: వరంగల్ నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో శ్రావణమాసోత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం శ్రీరుద్రేశ్వరస్వామి వారిని 51కిలోల పెరుగన్నంతో హలారుద్రేశ్వరుడిగా అలంకరించి అన్నపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని సందర్శించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపారు.



దర్శనానికి బారులుదీరిన భక్తులు, హలారుద్రేశ్వరుడి అలంకరణలో స్వామి

సీఎంఆర్ ధాన్యం మాయం!

- రెండేళ్లు గడుస్తున్నా సర్కారుకు చేరలే..
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.16 లక్షల మెట్రిక్ టన్నులు
- మాయమైన ధాన్యం విలువ రూ.221 కోట్లపైనే
- నిర్ధారించి నివేదిక ఇచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- కస్టమ్ మిల్లింగ్ ధాన్యంతో మిల్లర్ల జల్సా
- రికవరీపై సివిల్ సప్లయీస్ మీనమేషాలు



సాక్షి ప్రతినిధి, వరంగల్:

కస్టం మిల్లింగ్ ధాన్యం ఉమ్మడి వరంగల్‌లో దారి తప్పుతోంది. రూ.కోట్ల విలువైన సర్కారు ధాన్యంతో కొందరు మిల్లర్లు జల్సాలు చేస్తున్నారు. 45–60 రోజుల వ్యవధిలో బియ్యం రూపంలో తిరిగి చెల్లించాల్సిన కొందరు రైస్‌మిల్లర్లు బయట అమ్ముకుంటున్నారు. ఏటా ఇదే తంతు జరుగుతుండగా.. కట్టడి చేయాల్సిన పౌర సరఫరాలశాఖ అధికారులు కొందరు వారికి కొమ్ము కాస్తున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్‌లో 2022–23 సంవత్సరానికి చెందిన సుమారు రూ.221 కోట్ల యాసంగి ధాన్యం మాయమైంది. ఆకస్మికంగా తనిఖీలు చేపట్టిన స్టేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులు.. 29కిపైగా.. మిల్లుల్లో 1.16 లక్షల మెట్రిక్ టన్నుల సర్కారు ధాన్యం మాయమైనట్లు తేల్చారు. సీఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్లించి ఆ ధాన్యంతో కొందరు రైస్ మిల్లర్లు భూములు కొనుక్కుని రియల్ దందా చేస్తున్నారు. ధాన్యం కాజేసిన మిల్లర్లు వాయిదాల మీద వాయిదాలు పెడుతున్నారే తప్ప సర్కారుకు చెల్లించడం లేదు. అయినా అందులోని కొందరికి మళ్లీ 2024–25 యాసంగి సీఎంఆర్ ఇవ్వడం గమనార్హం.

తనిఖీల్లో బట్టబయలు..

2022–23 యాసంగి సీజన్‌లో సీఎంఆర్ ధాన్యం తీసుకున్న చాలా మంది మిల్లర్లు తిరిగి చెల్లించలేదు. దీంతో ఆమిల్లుల్లో ధాన్యాన్ని విక్రయించేందుకు పౌరసరఫరాల శాఖ 2024 ఫిబ్రవరిలో టెండర్లు నిర్వహించింది. ఈమేరకు ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా టెండర్లు దక్కించుకున్న వారు ఆగస్టులో తీసుకెళ్లేందుకు వెళ్లగా.. ఆయా మిల్లుల్లో ధాన్యం లేదు. దీంతో వాళ్లు పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా ఫిర్యాదు చేయడంతో ఏర్పాటు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సుమారు రూ.221 కోట్ల విలువైన 1.16 లక్షల మె.టన్నుల ధాన్యం దారిమళ్లినట్లు గుర్తించి నివేదిక ఇచ్చారు. హనుమకొండ జిల్లాలో 15 వేలు, వరంగల్‌లో 36, మహబూబాబాద్ జిల్లాలో 44 వేల మె.టన్నుల ధాన్యం మాయం కాగా.. జనగామ, ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో 21 వేల టన్నులు పక్కదారి పట్టినట్లు నిర్ధారించారు. ఈవిషయమై చాలా మంది మిల్లర్లపై (6ఏ) కేసులు నమోదు చేసి, రికవరీ కోసం నోటీసులు జారీ చేయగా.. ధాన్యం విలువ మేరకు సర్కారు డబ్బులు చెల్లిస్తామని కొందరు రైస్‌మిల్లర్లు అంగీకరించారు. ఈమేరకు జూన్ 10 వరకు 1.16 లక్షల మె.టన్నులకు సంబంధించిన బియ్యం చెల్లించాలని అగ్రిమెంట్ ఇచ్చారు. దీంతో తిరిగి.. ఇందులో చాలా మందికి 2024–25 సీఎంఆర్ కూడా కేటాయించారు. కాగా.. ఈ విషయమై తదుపరి చర్యల కోసం కమిషనర్‌కు లేఖ రాశామని, వారి సూచనలు, ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.

అధికారులకు వరంగా సీఎంఆర్ బకాయి..

సీఎంఆర్ బకాయిలు కొందరు అధికారులకు వరంగా మారాయనే చర్చ జరుగుతోంది. రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లర్లకు కేటాయించి.. తిరిగి బియ్యం స్వీకరించే ప్రక్రియలో కొందరు అధికారుల తీరు ఇప్పటికే వివాదాస్పదంగా మారింది. అలాంటి వారు 2022–23 సంవత్సర ధాన్యాన్ని పక్కదారి పట్టించిన రైస్‌మిల్లర్ల నుంచి రాబట్టడంలో కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారనే చర్చ కొందరు రైస్‌మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు చర్చించుకుంటుండడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఉమ్మడి జిల్లాలో రూ.221 కోట్ల విలువైన 1.16 లక్షల మె.టన్నులు రాబట్టడంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీరియస్ అయినట్లు తెలిసింది. ఈమేరకు మళ్లీ రికవరీపై సీరియస్‌గా స్పందించిన జిల్లా అధికారులు మిల్లులకు నోటీసులు పంపే వరకు వెళ్లినట్లు సమాచారం. రాష్ట్రస్థాయి నుంచి మొదలైన ఒత్తిడి నేపథ్యంలో.. ఉమ్మడి జిల్లాలోని రెండు జిల్లాలకు చెందిన జిల్లా మేనేజర్లు, ఓ జిల్లాకు చెందిన డీఎస్ఓ రంగంలోకి దిగినట్లు తెలిసింది. ఆజిల్లాల్లో ధాన్యం మాయం చేసిన మిల్లర్ల పక్షాన ఆపై అధికారులతో మంతనాలు జరుపుతూ వెసులుబాటు కల్పించారన్న ప్రచారం ఉంది. కాగా, ఆనోటా.. ఈనోటా రాష్ట్రస్థాయి అధికారులకు చేరిన ఈ వ్యవహారంపై వారు కూడా ఆరా తీస్తుండడం హాట్‌టాపిక్‌గా మారింది.

'ఫెర్టిలిటీ'పై నిఘా

- హైదరాబాద్ 'సృష్టి' ఫెర్టిలిటీ సెంటర్ ఘటనతో కదలిక
- గ్రేటర్ వరంగల్‌లో పుట్టగొడుగుల్లా ఫెర్టిలిటీ కేంద్రాలు
- త్రినగరిలో శిశు విక్రయాలు జరిగాయా? అనే కోణంలో అధికారుల ఆరా..



సాక్షి, వరంగల్: హైదరాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో బహిర్గతమైన మోసం పాఠకులకు తెలిసిందే. ఈనేపథ్యంలో గ్రేటర్ వరంగల్‌లోని సంతాన సాఫల్య కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ, పోలీసులు కన్నేశారు. సరోగసి ముసుగులో శిశు విక్రయాలు చేస్తూ.. ఇక్కడ కూడా ఆ తరహా వ్యాపారం ఏమైనా జరుగుతోందా? అనే దిశగా దృష్టి సారించారు. ఈ త్రినగరిలో పదుల సంఖ్యలో సంతాన సాఫల్య కేంద్రాలు ఉండడం, ఇక్కడ కూడా వందల సంఖ్యలో పిల్లలు లేని దంపతులు సంప్రదిస్తుండడంతో సరోగసి ముసుగులో శిశు విక్రయాలు జరుగుతున్నాయా అనే కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నారు.

అప్రమత్తమైన వైద్య శాఖ

ఆయా కేంద్రాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్షుణ్ణంగా రికార్డులను తనిఖీ చేస్తున్నారు. అన్నింటికీ అనుమతులు ఉన్నాయా? లేవా? ఉంటే నిబంధనలు పాటిస్తున్నారా? అనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ నుంచి వచ్చిన ఆదేశాలతో ఇక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు. సరోగసీ ద్వారా బిడ్డను పొందిన దంపతులకు నిజంగా వారి అండాలు, శుక్రకణాల ద్వారానే పొందారా? లేదా అక్రమ శిశు విక్రయాలు ద్వారా బిడ్డ వచ్చిందా? అనే విషయాలు తెలుసుకుంటున్నారు.

'క్యాష్' చేసుకోవడానికే..

సంతానోత్పత్తి కోసం సరోగసి పేరుతో జరుగుతున్న దందాకు చెక్ పెట్టడానికి 2021లో ది సరోగసీ (రెగ్యులర్) యాక్ట్‌ను అమలులోకి తీసుకొచ్చింది. దీంతో ప్రభుత్వ అనుమతితోనే సంబంధీకుల ద్వారానే సరోగసి ద్వారా బిడ్డలు పొందే అవకాశం ఉంది. వివిధ వృత్తుల రీత్యా ఒత్తిడితో పెరిగిపోతున్న సంతాన లేమి సమస్యను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం 2023లో ఈ చట్టంలో కొన్ని మార్పులు చేసింది. దీని ప్రకారం సంతానం ఆశించే భార్యభర్తలు ఎగ్, స్పెర్మ్ డొనేషన్ విధానంలో తీసుకునే అవకాశం కల్పించింది. భార్యలో లోపం ఉంటే డోనర్ అయిన మహిళ నుంచి, భర్తలో లోపం ఉంటే డోనర్ అయిన పురుషుడి నుంచి స్పెర్మ్ తీసుకోవచ్చు. ఈ వ్యవహారాల్లో ఎక్కడా ఆర్థిక లావాదేవీలు, క్రయ,విక్రయాలకు ఆస్కారం ఉండకూడదు. దీన్ని క్యాష్ చేసుకోవడానికి అనేక అక్రమ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. సంతాన భాగ్యం లేని దంపతుల్లో ఉన్న లోపాలను క్యాష్ చేసుకోవడానికి దందాలు ప్రారంభించాయి. లైసెన్స్ ఉన్న అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ) బ్యాంక్‌లకు అనుబంధంగా, వాటితో సంబంధం లేకుండా వెలసిన అక్రమ కలెక్షన్ ఏజెన్సీలు ఎన్నో ఉంటున్నాయి. ఓ రాష్ట్రం, నగరంలో దందా చేసే సరోగసి కేంద్రంగా మరో ప్రాంతాల్లో ఉన్న ఏజెన్సీల నుంచి వీటిని ఖరీదు చేస్తున్నాయి. తమ ఉనికి, దందా బయటపడకుండా ఉండేందుకు ఇలా చేస్తున్నట్టు వైద్య వర్గాలంటున్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాకంతో అక్రమ శిశు విక్రయాలు రూ.లక్షల్లో జరిగిందని వెలుగులోకి రావడంతో గ్రేటర్ వరంగల్‌లోనూ అనుమానాలకు తావిస్తోంది. అయితే సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీలపై వైద్య, పోలీసు వర్గాలు ఇప్పటివరకు అధికారికంగా ఎక్కడా ధ్రువీకరించడం లేదు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా పోస్టర్లు విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు, బాధ్యులు

- ఆగస్టు 1న ధర్నాను విజయవంతం చేయాలి
- యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు తిరుపతి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల్ని పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు నన్నబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1న హనుమకొండలోని ఏకశిల పార్కులో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సోమవారం హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా నిర్వహించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రాల్లో ధర్నా అనంతరం ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయుల మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేసి ఈనెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అర్హతలు లేని డీఈఓలను తొలగించాలన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన జిల్లాలకు డీఈఓ పోస్టులు, రెవెన్యూ డివిజన్లకు డిప్యూటీ డీఈఓ, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. టీచర్ల ఏకీకృత సర్వీస్‌రూల్స్‌ను రూపొందించి వేకెన్సీలను భర్తీ చేయాన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కదారి భోగేశ్వర్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రెండు జిల్లాల బాధ్యులు కె.శ్రీనివాస్, జి.ఉప్పలయ్య, గొడిశాల సత్యనారాయణ పెండెం రాజు, సుజన్‌ప్రసాద్ రావు, ఉట్కూరు అశోక్, గోవిందరావు, వెంకటేశ్వర్లు, రాజయ్య డి.మహేందర్‌రెడ్డి, గోవర్ధన్, జగన్మోహన్, మహేందర్‌రావు, ఎ.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్యాయత్నం

నర్సంపేట రూరల్: భూ వివాదంలో మనస్తాపం చెందిన నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామానికి చెందిన చిదిరాల వీరస్వామి సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. నాలుగేళ్ల క్రితం అతడి భార్య అనారోగ్యంతో మృతి చెందింది. మూడేళ్ల క్రితం కొడుకు హేమంత్ ఉరేసుకున్నాడు. అప్పటి నుంచి వీరస్వామి ఒక్కడే ఉంటున్నాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన కందకట్ల రాధికతో వీరస్వామికి ఏడాది క్రితం వివాహమైంది. రాధిక పేరున ఉన్న 1.6 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో కొందరు వ్యక్తులు రాధిక పేరుమీద ఉన్న భూమిని వేరే వ్యక్తులపై మార్పిడి చేయించుకున్నారని, వ్యవసాయ భూమి వద్దకు వెళ్లడంతో ఈ భూమి తమదని వారు చెప్పడంతో వీరస్వామి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

అర్జీలు త్వరగా పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ

న్యూశాయంపేట: ప్రజావాణికి వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలని వరంగల్ అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 152 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఎక్కువ మొత్తంలో రెవెన్యూ 60, హౌసింగ్ 28, దరఖాస్తులు వచ్చాయి. వివిధ శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, అగ్రికల్చర్ అధికారి అనురాధ, డీపీఓ కల్పన, డీసీఓ నీరజ, ఏఓ విశ్వప్రసాద్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

పట్టా రద్దు చేయాలి



నా పేరున ఉన్న భూమిని అబద్ధాలు చెప్పి సంతకం పెట్టించుకుని మిగతా కుమారులకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్న నా రెండో కుమారుడు (ప్రభుత్వ ఉద్యోగి)పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి. పట్టాను రద్దు చేసి భూమిపై నాకు హక్కు కల్పించాలి. నేను బతికున్నంత కాలం నాపేరు మీదే భూమి ఉండాలి. అనంతరం ముగ్గురు కుమారులకు చెందాలి.

- లద్దునూరి సూరమ్మ, రుద్రగూడెం, నల్లబెల్లి

వాహనం అందించాలి..



నేను దివ్యాంగురాలిని. నా తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించారు. అమ్మమ్మ, తాతయ్య సంరక్షణలో ఉంటూ వికలాంగుల బాలికల హాస్టల్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. నాకు రెట్రో ఫిటెడ్ మోటరైజ్డ్ వెహికిల్ అందించాలని వేడుకుంటున్నా.

- ఐత అమ్ములు, వర్ధన్నపేట

ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి..



ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద 1998–99లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుపేద ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన 11 కుటుంబాలకు 12.3 గుంటల భూమిని కేటాయించింది. ఉమ్మడి పట్టాలు అందజేసింది. మాకు కేటాయించిన భూమి గెట్టున ఉన్న ఓ అగ్రకుల సామాజికవర్గానికి చెందిన ఆక్రమణదారుడు మాకు తెలియకుండా పట్టా చేయించుకున్నాడు. అతడిపై, అతడికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- పర్వతగిరికి చెందిన ఎస్సీ కుటుంబాలు

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి..



నా పట్టా భూమిలో పెంచుకున్న సుమారు 100 టేకు చెట్లు నరికిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో మొక్కలు నాటాను. పోలీస్‌స్టేషన్‌లో, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

- బి.దస్రు, గోవిందాపూర్, నల్లబెల్లి

గేదెల చోరీ.. ముఠా అరెస్ట్

గీసుకొండ: గేదెల దొంగల ముఠాను గీసుకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని రత్తిరాం తండాకు చెందిన రైతు వాంకుడోతు బాలరాజు ఇంటి ఎదుట కట్టేసిన మూడు గేదెలు ఈనెల 17న చోరీకి గురయ్యాయి. బాలరాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. బృందాలుగా ఏర్పడి దొంగల కోసం గాలిస్తుండగా ఎస్ఐ కె.కుమార్‌కు సోమవారం బైక్‌పై వెళ్తున్న దొంగలను ఊకల్ క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. వారి నుంచి వ్యాన్, ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లతో పాటు గేదెలను అమ్మగా వచ్చిన రూ. 85 వేలు స్వాధీనం చేసుకున్నట్లు గీసుకొండ సీఐ మహేందర్ తెలిపారు. దొంగలు మహ్మద్ యాకూబ్‌పాషా (ఉర్సు, ఖిలావరంగల్), ఎండీ రబ్బానీ (ఉర్సు కరీమాబాద్), ఎస్‌కే మోజో(ఉర్సు, వరంగల్), భూక్య రాజు(నందనాయక్‌తండా), అజ్మీరా ఉదయ్ (నందనాయక్‌తండా), ఎండీ సమీర్ (చైతన్యనగర్, శంభునిపేట)ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

మేడిగడ్డకు వరద ఉధృతి



కాళేశ్వరం: మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత వరదతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సోమవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో పుష్కరఘాట్లను తాకుతూ దిగువకు తరలుతోంది. దీంతో కాళేశ్వరం వద్ద 10 మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహిస్తోంది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీకి వరదనీరు 5.12 లక్షల క్యూసెక్కులు తరలి రాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అదేస్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు.

జాతీయ విద్యా విధాన ఉత్సవానికి మన్మోహన్‌కు ఆహ్వానం



మన్మోహన్

విద్యారణ్యపురి: న్యూఢిల్లీలో నేడు(మంగళవారం) జాతీయ విధానం ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి విద్యాశాఖ సమగ్ర శిక్ష హనుమకొండ జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ బండారు మన్మోహన్‌కు ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమం జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)–2020 అమలై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ హాజరుకానున్నారు. కాగా, మన్మోహన్ గతంలో హైదరాబాద్‌లో ఎస్‌ఈఆర్‌టీ ఫ్యాకల్టీగా పనిచేశారు. బోధన, శిక్షణ విద్యాసాంకేతికత అభివృద్ధిలోనూ సేవలందించారు.

అనుమానాస్పద స్థితిలో వాచ్‌మెన్ మృతి




శ్రీనివాస్(ఫైల్)

హన్మకొండ అర్బన్ : హంటర్‌రోడ్డులోని వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పోరిపాక శ్రీనివాస్(54) సోమవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పాఠశాల ఆవరణలో విగతజీవిగా ఉన్న శ్రీనివాస్‌ను విద్యార్థులు గమనించి యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. దీంతో యాజమాన్యం పోలీసులకు సమాచారం అందజేసింది. అయితే విషయం బహిర్గతం కాకుండా మృతుడి బంధువులతో పాఠశాల యాజమాన్యం మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడు కాజీపేట మండలం భట్టుపల్లి సమీపంలోని కొత్తపల్లి హవేలీకి చెందిన వ్యక్తి అని తెలిసింది. శ్రీనివాస్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

3న టీటీసీ థియరీ పరీక్షలు

విద్యారణ్యపురి : జిల్లాలో టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) థియరీ పరీక్షలు ఆగస్టు 3వతేదీన నిర్వహించనున్నట్లు హనుమకొండ డీఈఓ డి.వాసంతి సోమవారం తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టిసింగ్ ఉన్నత పాఠశాల, లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, పెట్రోల్ పంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు టీటీసీ పరీక్షలు నిర్వహిస్తారని డీఈఓ వివరించారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణా.గౌట్.ఇన్ వెబ్‌సైట్ నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆయా పరీక్ష కేంద్రాలకు అర్ధగంట ముందుగా చేరుకోవాలని డీఈఓ వాసంతి సూచించారు.

ఎంజీఎం నర్సింగ్ స్కూల్ భవనంలోని తరగతి గదులపై ఊడిన పెచ్చులు



తప్పిన పెనుప్రమాదం..

ఎంజీఎంలో కూలిన నర్సింగ్ స్కూల్ భవనం పైపెచ్చులు
- ఆ సమయంలో విద్యార్థులు లేకపోవడంతో తప్పిన ముప్పు
- ఊపిరి పీల్చుకున్న అధికారులు, విద్యార్థులు
- తరగతులు, హాస్టళ్ల నిర్వహణపై అధికారులు మల్లగుల్లాలు



పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన భవనం



భవనంలోని గదులకు పట్టిన పాకురు



ఎంజీఎం : 65 ఏళ్ల క్రితం నిర్మాణం.. 10 ఏళ్లగా ప్రమాదపుటంచుల్లో కొనసాగుతున్న భవనం .. విద్యార్థులు, అధ్యాపకులు భవనం పైపెచ్చులు కూలడంతో పలుమార్లు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఈ ప్రమాద పరిస్థితిపై అధికారులు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు నివేదిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో గతేడాది వర్షాకాలం ప్రారంభంలోనే రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలెక్టర్ డాక్టర్ సత్యశారద కూడా ఈ భవనాన్ని సందర్శించారు. ఏ ప్రమాదం జరగకముందే హుటాహుటిన విద్యార్థులను వేరే ప్రదేశానికి తరలించాలని నిర్ణయించి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. వరంగల్‌లోని రామ్‌కీ అపార్ట్‌మెంట్‌లో వసతి కల్పించేందుకు స్థలం ఎంపిక చేశారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులపై స్పందన రాకపోవడంతో అదే శిథిలావస్థకు చేరిన ప్రమాదపు భవనంలో 200 మంది నర్సింగ్ విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పెద్దఎత్తున స్కూల్ భవనంపై పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో విద్యార్థుల ఎవరూ లేకపోవడంతో అధికారులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

67 ఏళ్ల క్రితం భవనం..

ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలోని నర్సింగ్ స్కూల్‌లో 180 మంది విద్యార్థులు జీఎన్ఎం కోర్సు అభ్యసిస్తున్నారు. కాగా, నర్సింగ్ విద్యార్థుల కోసం 1958లో రెండు అంతస్తుల భవనం నిర్మించారు. ఈ భవనంలో సుమారు 50 హాస్టల్ గదులు, 60 మంది విద్యార్థులకు సరిపడేలా మూడు తరగతి గదులు, కిచెన్‌తో పాటు మెస్ సౌకర్యం ఉంది. అయితే ఈ భవనం గత 10 నుంచి 15 ఏళ్లుగా శిథిలావస్థకు చేరి ఎక్కడ చూసి పెచ్చులు ఊడి, పాకురు పట్టి ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితిలో కొనసాగుతోంది. ఈ భవనంలో విద్యాసంస్థను కొనసాగించడమంటే ప్రాణాలతో చెలగాటమాడడమేనని కలెక్టర్ కూడా తన సందర్శనలో గుర్తించారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఎవరైనా విద్యార్థినీ, అధ్యాపక బృందం ప్రాణాలు కోల్పోతే కాని అధికారులు స్పందించారా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

సెలవురోజు కావడంతో తప్పిన పెనుముప్పు

నర్సింగ్ స్కూల్ భవనం పై పెచ్చు ఊడిన సమయం రాత్రి వేళ అవ్వడంతోపాటు ఆ రోజు ఆదివారం సెలవు కావడంతో పెను ముప్పు తప్పింది. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు ఊపిరి పీల్చుకున్నారు. పై పెచ్చులు ఊడి కిందపడిన ఘటనను చూసే ఆ సమయంలో ఉంటే కచ్చితంగా ఆ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయేవారని ఆ ఘటనను చూస్తే అర్థమవుతుంది.

డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం..



నర్సింగ్ స్కూల్ భవనం, ఆస్పత్రుల్లో శిథిలావస్థకు చేరి పై పెచ్చులు భవన పరిస్థితులను ఎప్పటికప్పుడు కలెక్టర్, డీఎంఈకి వివరిస్తున్నాం. ప్రస్తుతం భవన నిర్మాణం మరమ్మతులను ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు ప్రస్తుతం వసతి, బోధన కొనసాగించాలా.. లేదా అనే అంశాలను కలెక్టర్, రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– కిశోర్, సూపరింటెండెంట్, ఎంజీఎం

టీ-హబ్‌తో ఎంఓయూ కోసం చర్చలు

- ఆ కార్యాలయాన్ని సందర్శించిన వీసీ ప్రతాప్‌రెడ్డి



టీ-హబ్ ప్రతినిధులతో వీసీ ప్రతాప్‌రెడ్డి బృందం

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని టీ–హబ్‌తో కాకతీయ యూనివర్సిటీలోని కే–హబ్ ఎంఓయూ కోసం కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రూసానోడల్ ఆఫీసర్, కేయూ జియాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, కే–హబ్ డైరెక్టర్ సవితాజ్యోత్స్న సోమవారం టీ–హబ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టీ–హబ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తాలూక్ తదితరులతో సమావేశమై ఎంఓయూ కోసం చర్చలు జరిపారు. రెండో శ్రేణి నగరం వరంగల్ అభివృద్ధి చెందుతున్న తరుణంలో స్టార్టప్‌ల స్థాపన, ఇంక్యూబేషన్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన వ్యవస్థలపై సమాలోచనలు జరిగాయి. టీ– హబ్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక మౌలిక సదుపాయాలను పరిశీలించి ఆ వసతులను కే–హబ్‌లో ఎలా రూపొందించొచ్చు అనే అంశంపై విశ్లేషించారు. కే–హబ్ అభివృద్ధిలో టీ–హబ్ సీఈఓ కవికృత్ సహకారంతో ముందడుగు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేయూ డిప్యూటీ రిజిస్ట్రార్ మహ్మద్ హబీబ్, కే–హబ్ కోఆర్డినేటర్లు బొల్లం కిరణ, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య అడ్మిషన్లలో జీఓ 33 అమలు చేయాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నీట్ అభ్యర్థుల తల్లిదండ్రులు

ఎంజీఎం : రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 2024, జూలై 19న జారీ చేసిన జీఓ 33ను ఈ విద్యా సంవత్సరం –2025–26లో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో అమలు చేయాలని నీట్ అభ్యర్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీఓ 33 అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ సోమవారం కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థుల స్థానిక స్థితిని కాపాడడం, కాంపిటెంట్ అథారిటీ కోటా (రాష్ట్ర కోటా) కింద రాష్ట్రంలో విద్యను పూర్తి చేసిన వారికి సరిగా సీట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ఈ జీఓ తీసుకొచ్చిందన్నారు. ఈ జీఓ అమలు ద్వారా రాష్ట్ర విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లలో జీఓ 33 అమలు చేయాలని కోరారు.

ఆస్తి పంపకాలు చేయని తండ్రి..

- కుమారుడి మృతదేహాన్ని తండ్రి ఇంట్లో ఉంచి ఆందోళన
- భజన తండాలో ఘటన



బిక్కు (ఫైల్)



హుస్సేన్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

మహబూబాబాద్ రూరల్ : ఆస్తిని తండ్రి తన ఇద్దరు కుమారులకు పంచి ఇవ్వకపోవడంతో పెద్ద కుమారుడు మనస్తాపంతో మృతి చెందాడు. దీంతో ఆస్తి పంపకాలు చేపట్టాలంటూ తండ్రి ఇంట్లో ఆ కుమారుడి మృతదేహం ఉంచి ఆందోళన చేపట్టారు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి బేతోలు గ్రామ శివారు భజన తండాలో చోటుచేసుకుంది. స్థానికులు, కురవి పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బోడ హుస్సేన్, ఝమ్మ దంపతులకు బిక్కు(45), రవీందర్, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరి పెళ్లిళ్లు జరిగాక సుమారు ఆరు ఎకరాల భూమి ఉండగా అందులో నుంచి రెండు ఎకరాలు హుస్సేన్ విక్రయించాడు. మిగతా భూమిని ఎవరికి పంచి ఇవ్వకుండా తనవద్దే ఉంచుకోగా పెద్ద కుమారుడు బిక్కు వేరే చోట ఇల్లు నిర్మించుకుని ఉంటున్నాడు. అతడికి భార్య ఝాన్సీ, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో కూతురికి సంబంధం కుదరగా వివాహం చేయాలని బోడ ఇటీవల తన తండ్రి హుస్సెన్ వద్దకు వెళ్లి ఆస్తి పంపకాలు చేయాలని కోరగా అతడు నిరాకరించాడు. దీంతో ఈ విషయంపై తండ్రి, కుమారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. కాగా, భూమి పంచాలని బిక్కు కొన్నేళ్లుగా తండ్రిని కోరుతున్నా అతడు పట్టించుకోవడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన బిక్కు ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటనతో అతడి భార్య ఝాన్సీ, ఆమె బంధువులు బిక్కు మృతదేహాన్ని తీసుకెళ్లి తండ్రి హుస్సెన్ ఇంట్లో ఉంచి ఆందోళన చేపట్టారు. ఆస్తి పంపకాలు చేపట్టే వరకు అంత్యక్రియలు నిర్వహించమని భీష్మించడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు సర్దిచెప్పినా బంధువులు వినకుండా ఆస్తి పంపకాల కోసం పట్టుబట్టగా బిక్కు అంత్యక్రియలపై గందరగోళం నెలకొంది. చివరకు పోలీసులు, పెద్దమనుషులు.. బంధువులతో మాట్లాడి బిక్కు వాటాకింద ఎకరం 10 గుంటల వ్యవసాయ భూమి బాండ్ పేపర్ రాసి ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది. అనంతరం బిక్కు అంత్యక్రియలు నిర్వహించారు.

విశ్లేషణాత్మక వార్తలు రాయాలి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యంపై ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

ఖిలా వరంగల్: జర్నలిస్టులు విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలు మాత్రమే రాయాలని వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. వరంగల్ కరీమాబాద్ ఉర్సు గుట్ట సమీపంలోని తాళ్లపద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజు లుగా జరుగుతున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నిజనిర్ధారణ అనేది జర్నలిజంలో ఒక ముఖ్యమైన భాగమని, జర్నలిస్టులు కచ్చితంగా నిజాలను నిర్ధారించుకున్న తర్వాతే నిర్భయంగా వార్తలు రాయాలన్నారు. వృత్తిపరమైన నియమాలను పాటించాలన్నారు. భవిష్యత్‌లో పత్రికల నిర్వహణలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించనుందన్నారు. అనంతరం జెడ్పీ సీఈఓ రామిరెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులు పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తూ వార్తలు సేకరించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండాలన్నారు. సమావేశంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరావు, మేనేజర్ శైలేష్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు తోట భావనారాయణ, ఉడుముల సుధాకర్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ)వరంగల్ అధ్యక్షుడు శ్రీరామ్‌రాంచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గా ప్రసాద్, డీపీఆర్ఓ అయూబ్ అలీ, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్లమల్లేశం, డైరెక్టర్ వరుణ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

రైల్వేఈసీసీఎస్, షేర్ హోల్డర్ల అభివృద్ధికి కృషి

- రైల్వే ఈసీసీఎస్ ప్రెసిడెంట్ చిలుకు స్వామి



చెక్కు పంపిణీ చేస్తున్న చిలుకు స్వామి, డైరెక్టర్లు

కాజీపేట రూరల్ : దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ పరిధిలోని రైల్వే ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (ఈసీసీఎస్) లిమిటెడ్‌తో పాటు సభ్యులైన షేర్ హోల్డర్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఈసీసీఎస్ ప్రెసిడెంట్ చిలుకు స్వామి అన్నారు. కాజీపేట జంక్షన్‌లో సోమవారం రైల్వే ఈసీసీఎస్ బోర్డు డైరెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో మొత్తం 42 వేల మంది ఈసీసీఎస్ షేర్ హోల్డర్లు ఉన్నారన్నారు. విశాఖ సౌత్‌కోస్ట్ రైల్వే బైపర్‌కేట్‌తో 17వేల మంది డైవర్ట్ అవుతున్నారని,వీరి కోసం విశాఖ కేంద్రంగా ఈసీసీఎస్ బ్రాంచ్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఈసీసీఎస్‌లో రుణాలు తీసుకుని వివిధ కారణాలతో మృతి చెందిన నలుగురు షేర్ హోల్డర్స్ తీసుకున్న రుణాలు సుమారు రూ.22 లక్షలు మాఫీ చేసి వారి సీఎంటీడీ జమ డబ్బులు రూ.16,52,430ల చెక్కులు అందజేశామన్నారు. సమావేశంలో సికింద్రాబాద్ ఈసీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.రామ్మోహన్, సెక్రటరీ సి.చంద్రశేఖరశర్మ, కాజీపేట ఈసీసీఎస్ డైరెక్టర్లు డి.శ్రీనివాస్‌యాదవ్, దేవులపల్లి రాఘవేందర్, కాజీపేట ఈసీసీఎస్ డెలిగేట్స్ బి.శ్రీనివాస్, రాజేందర్, ఇ.రాజు, సునీల్, నాగరాజు, ఎల్.కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

అక్కడ తప్పించుకున్నాడు.. ఇక్కడ చిక్కాడు

- గంజాయి వ్యాపారి అరెస్ట్, రిమాండ్
- రూ.15లక్షల విలువైన సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

హసన్‌పర్తి: టాస్క్‌ఫోర్స్, ఆర్పీఎఫ్ నుంచి తప్పించుకున్న ఓ గంజాయి వ్యాపారి.. చివరికి హసన్‌పర్తి పోలీసులకు చిక్కాడు. ఈ మేరకు హసన్‌పర్తి పీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి వివరాలు వెల్లించారు. ఒడిశాలోని మోహన తాలూకాకు చెందిన ఆశీష్ కుమార్ దిన సరికూలీ. వచ్చిన సంపాదనతో కుటుంబ పోషణ భారంగా మారడంతో సులుభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఒడిశాలోని చాందిపుల్‌కు చెందిన జమీర్ నుంచి ఈనెల 25న 30 కిలోల బ్రౌన్ గంజాయి కొనుగోలు చేసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మహారాష్ట్రకు బయలుదేరాడు. 26న రైలు వరంగల్‌కు చేరుకుంది. అయితే అదే సమయంలో ఇటు ఆర్పీఎఫ్, అటు టాస్క్ ఫోర్స్ పోలీసులు రైలులో తనిఖీలు చేస్తుండడం గమనించిన ఆశీష్‌కుమార్.. వారి నుంచి తప్పించుకుని కాలినడకన హసన్‌పర్తి చేరుకున్నాడు. అక్కడి నుంచి రైలు ఎక్కడానికి ఎల్లాపురం స్టేషన్‌కు వెళ్తున్న క్రమంలో ఆ ప్రాంతంలో పోలీసుల తనిఖీల్లో చిక్కగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. పట్టకున్న గంజాయి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని ఏసీపీ తెలిపారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, సబ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్,సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

గంజాయి వ్యసనంతో కుటుంబాలు ఆగం..

గంజాయి వ్యసనంతో కుటుంబాలు ఆగమవుతున్నాయని ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వలస కూలీలు ఎక్కువ గంజాయి బారిన పడుతున్నారన్నారు. వీటిపై కళాశాలల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రిప్లెట్ బేబీలు

- ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు



కల్యాణికి జన్మించిన ముగ్గురు పిల్లలు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం వీఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన గుండ్లబోయిన కల్యాణి ఆదివారం రాత్రి మొదటి కాన్పులోనే ముగ్గురు పిల్లలకు (ఇద్దరు ఆడ, ఒకరు మగ శిశువు) జన్మనిచ్చింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పు జరిగింది. ప్రస్తుతం ముగ్గురు శిశువులను చిన్న పిల్లల ఆస్పత్రిలో ఉంచారు. కాగా, తల్లి, పిల్లలు క్షేమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

‘యూనివర్సిటీ పేపర్ లీకేజీ’ చిత్రాన్ని ఆదరించాలి

వివిధ విద్యార్థి సంఘాలు, సినీ నటుడు నారాయణమూర్తి విజ్ఞప్తి



సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు, నారాయణమూర్తి

నయీంనగర్: ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్నేహ చిత్ర పిక్చర్స్‌లో తెరకెక్కిన ‘యూనివర్సిటీ పేపర్ లీకేజీ’ చిత్రాన్ని ఆదరించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు ప్రేక్షకులను కోరారు. సోమవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్.నారాయణ మూర్తి ‘యూనివర్సిటీ పేపర్ లీకేజీ’ సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దశాబ్దాలుగా పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్టు ఈ చిత్రం తీశారని, ప్రేక్షలు ఆదరించాలని కోరారు. అనంతరం నారాయణమూర్తి మాట్లాడుతూ ఈ రోజుల్లో పేపర్ లీకేజీ వ్యవహారం సర్వసాధారణంగా మారిందన్నారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు, ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రశ్న పత్రాలు లీక్ అవ్వడమంటే సమాజాన్ని నాశనం చేయడమే అన్నారు. నేడు చదువు కార్పొరేట్ కబంధ హస్తాల్లో చిక్కుకుందని, చదువుకునే రోజుల నుంచి చదువు కొనుక్కునే పరిస్థితులు దాపురించాయని, ఈ విషయాలు చిత్రంలో వివరించామన్నారు. సేవా రంగంగా ఉండాల్సిన విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారంగా మార్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బాషబోయిన సంతోష్, రంజిత్ కుమార్, సాయి,వేల్పుల చరణ్, రవితేజ, వినయ్, వంశీకృష్ణ, విజయ్, కల్యాణ్, వినయ్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో బాలింత మృతి

- వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

నెహ్రూసెంటర్: వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందని ఆరోపిస్తూ జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర నర్సింగ్ హోం ఎదుట మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం ఆందోళన చేపట్టారు. మృతురాలి భర్త, బంధువుల కథనం ప్రకారం.. కురవి మండలం కాంపెల్లి శివారు పలుగుబోడు తండాకు చెందిన బోడ పద్మ (25) రెండో కాన్పు ప్రసవం నిమిత్తం ఆదివారం శ్రీవేంకటేశ్వర నర్సింగ్ హోమ్‌కు వచ్చారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు ఆపరేషన్ చేయగా కవలలు (ఆడ శిశువులు) జన్మించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పద్మకు పొట్ట ఉబ్బడంతోపాటు నొప్పి వచ్చింది. ఈ సమస్యను వైద్యులకు వివరించగా తాము చూసుకుంటామని చెప్పారు. కాగా, మధ్యాహ్నం పద్మ మృతి చెందింది. దీంతో పద్మ మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యుడు అర్జున్‌రెడ్డిని వివరణ కోరగా మొదటి కాన్పు నార్మల్‌గా జరిగిందని, రెండో కాన్పుకు పొట్టలో నీరు ఉందని, బీపీ ఎక్కువ ఉండడంతో సీరియస్‌గా ఉందని కుటుంబ సభ్యులకు వివరించామని తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో కార్డియాక్ అరెస్టు కావడంతో పద్మ మృతి చెందినట్లు వివరించారు. మహబూబాబాద్ టౌన్ ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మాకు న్యాయం చేయాలి..

- మృతుడి కుటుంబ సభ్యుల డిమాండ్
- మృతదేహంతో కారు యజమాని ఇంటి ఎదుట ఆందోళన



మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

సంగెం: తమకు న్యాయం చేయాలని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ యువకుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యువకుడి మృతికి కారణమైన కారు యజమాని ఇంటి ఎదుట మృతదేహం ఉంచి ఆందోళన చేపట్టారు. ఈ ఘటన సోమవారం సంగెం మండలం కాపులకనిపర్తిలో జరిగింది. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన తోట రాజు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న ఖిలావరంగల్ మండలం నక్కలపల్లిలో ఓ రోగికి డ్రెస్సింగ్ చేసి బైక్‌పై హనుమకొండ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాపులకనిపర్తికి చెందిన కొండేటి ధనుశ్ వెనక నుంచి కారుతో ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాజును హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రాజు మృతికి కారణమైన ధనుశ్ స్వగ్రామం కాపులకనిపర్తిలోని తన ఇంటి ఎదుట మృతదేహం ఉంచి ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పర్వతగిరి సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో సంగెం, పర్వతగిరి, ఐనవోలు, మమునూరు ఎస్సైలు ఘటనా స్థలికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.